క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేపడుతున్న సీఐ తిరుమలరావు, ఎస్సై జ్ఞానప్రసాద్

రామభద్రపురం: మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. సీఐ తిరుమలరావు, ఎస్సై జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో రూ. 50 వేలకు మించి నగదు, మద్యం తీసుకెళ్లకూడదన్నారు. ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు సంబంధించిన ఆధారాలు ఉంచుకోవాలని సూచించారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం

బొబ్బిలి: పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రెండు రోజులుగా బూత్‌స్థాయి నాయకులతో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏడో వార్డులో ఎమ్మెల్యే శంబంగి, తదితరులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. స్థానిక మహిళలు శంబంగికి హారుతులిచ్చి ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని శంబంగి, తదితరులు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విసు), తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి..



పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలుగుతుందని చెప్పారు.

నవోదయలో సీటు సాధించిన త్రివేద్



మెంటాడ: మండలంలోని మెంటాడ గ్రామానికి చెందిన సువ్వాడ త్రివేద్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించాడు. ఆదివారం విడుదల చేసిన నవోదయ ఫలితాలలో 80 మార్కులకు గాను 74 మార్కులు సాధించాడు. అలాగే ఇటీవల ప్రకటించిన సైనిక్ స్కూల్ ఫలితాలలో 300 మార్కులకు గాను 258 మార్కులు సాధించి సైనిక్ స్కూల్‌లోను సీటు పొందాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన త్రివేద్ ఇటు నవోదయ, అటు సైనిక్ స్కూల్ ఫలితాల్లో ప్రతిభ కనబరచడంతో గ్రామస్తులు అభినందించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేయరాదు



వాహన చోదకులను తనిఖీ చేస్తున్న ఎస్సై రమేష్

తెర్లాం: మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్.రమేష్ అన్నారు. రాజాం –రామభద్రపురం రోడ్డులో ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. అలాగే మండలంలోని పణుకువలస పంచాయతీ సోమిదవలసలో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

స్వాగత ద్వారం ప్రారంభం



స్వాగత ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: మండలంలోని చింతాడ గ్రామ స్వాగత ద్వారాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేదెల నారాయణ, వరలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు లావణ్య, కృష్ణమూర్తి స్వాగత ద్వారం నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బంకురు తిరుపతిరావు, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే..

- రాజాం నియోజకవర్గంలో భారీ మెజార్టీ ఖాయం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



రాజాం: గాంధీనగర్‌లో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్

రాజాం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ఆదివారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. డాక్టర్ రాజేష్‌కి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని వివరించారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని, సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని అన్నారు. ప్రతీ ఇంట్లో ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, పార్టీ నాయకులు సడెం శ్రీరామమూర్తి, దూబ గోపాలం, కె.శ్రీనివాసరావు, ఆసపు సూర్యం, శాసపు వేణుగోపాలనాయుడు, తోట తిరుమలరావు, పాలవలస శ్యామ్‌సుందరరావు, విష్ణుపాత్రుని శంకరరావు, కోరాడ రామినాయుడు, ఆర్.జయరాం, గోకవలస బాబూరావు, వైకుంఠరావు, హరి, నీలకంఠం, అల్లెన జయలక్ష్మి పాల్గొన్నారు.



రాజాం సిటీ: మారుతీనగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, తదితరులు

సీఎం జగన్‌తోనే సంక్షేమం

రాజాం సిటీ: రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. పట్టణంలోని మారుతీనగర్ కాలనీలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తనను గెలిపించడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాలని అభ్యర్థించారు. అంతకుముందు డాక్టర్ రాజేష్ దంపతులను కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, శాసపు వేణుగోపాల్, కెంబూరు నారాయణరావు, పాలవలస రాంబాబు, పి.శంకర్, యు.విష్ణు, గోకవలస గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులకు తీవ్ర ఇబ్బంది..

- ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకూడదని ఈసీ నిర్ణయించడం వల్ల పెన్షన్ లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ఎంపీపీ చొక్కపు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు ఇంటి వద్దే పింఛన్లు అందిస్తున్న వలంటీర్లపై తప్పుడు ఫిర్యాదు చేయడం చంద్రబాబుకు తగదన్నారు. టీడీపీ స్వప్రయోజనాల కోసం ప్రజలను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు.

కుంటినవలసలో వైఎస్సార్‌సీపీ ప్రచారం

మెంటాడ: మండలంలోని కుంటినవలసలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నాకర్‌నాయుడు, తదితరులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి పీడిక రాజన్నదొరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రావాడ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూర్యారావు, పార్టీ నాయకులు పెదిరెడ్ల సూర్యనారాయణ, అరుణ, తదితరులున్నారు. అలాగే గుర్ల తమ్మిరాజుపేట గ్రామంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ, సీనియర్ నాయకులు చొక్కాలు సన్యాసినాయుడు, రాజప్పలనాయుడు ప్రచారం చేశారు.



కుంటినవలసలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్ని పార్టీలు కలిసొచ్చినా.. వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్

రేగిడి: ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని అంబఖండి గ్రామంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌తో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రాంత్ మాట్లాడుతూ.. కూటమితో ఒరిగేదేమి లేదన్నారు. టీడీపీని ప్రజలు నమ్మడంలేదని, అందుకే చంద్రబాబు ఊసరవెల్లి మాదిరి రంగులు మార్చుతూ పలు పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. 40 సంవత్సరాల అనుభవం అని చెప్పుకొచ్చిన చంద్రబాబుకు మిగిలిన పార్టీలు కలిస్తేగానీ ఎమ్మెల్యే అభ్యర్థులు దొరకలేదని విమర్శించారు. గతంలో ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎగొట్టిన ఘనత చంద్రబాబుకు ఉందని, ఇప్పుడు ఆ అంశాలు ప్రజలు గుర్తుకు తెచ్చుకుని, టీడీపీని, కూటమిని ఛీ కొడుతున్నారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని స్పష్టం చేశారు. రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా విద్యావంతుడైన డాక్టర్ తలే రాజేష్‌కి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, పార్టీ ఎమ్మెల్యేగా రాజేష్‌కు భారీ మెజార్టీ వస్తుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించండి..



21వ వార్డు బూత్ లెవిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని 7, 9, 10, 17, 21, 28 వార్డుల్లో బూత్ లెవల్ సమావేశాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పరిపాలన పట్ల సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో మంచి జరిగిందని చెప్పారు. సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ గెలవాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీ సభ్యులకు, వైఎస్సార్‌సీపీ హయాంలోని వలంటీర్ వ్యవస్థకు మధ్య ఉన్న తేడాను వివరించాలన్నారు. సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విసు), మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి, తదితరులు పాల్గొన్నారు.

'మేం సిద్ధం' పత్రాల పంపిణీ



ప్రచార పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ పద్మావతి, తదితరులు

రాజాం: మండలంలో గార్రాజు చీపురుపల్లి గ్రామంలో 'మేం సిద్ధం–మా బూత్ సిద్ధం' కరపత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ధర్మాన పద్మావతి ఇంటి వద్ద గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పద్మావతి మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం కార్యకర్తలకు, అభిమానులకు పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన సిద్ధం పత్రాలు అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పొన్నాడ సన్యాసినాయుడు, పొన్నాడ తవిటినాయుడు, గృహసారథులు పాల్గొన్నారు.

అంతర పంటగా నవధాన్యాల సాగు

రేగిడి: రైతులు అపరాల సాగులో అంతరపంటగా నవధాన్యాలను సాగుచేసుకుంటే మంచి లాభాలు వస్తాయని ప్రకృతి వ్యవసాయం ఎంటీ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో ఆదివారం నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. తోటకూర, గోంగూర, చిక్కుడు, జొన్న, సజ్జ, రాగి తదితర విత్తనాలను పంటల్లో వేయాలని సూచించారు. ఏక కాలంలో రెండు నుంచి మూడు పంటలు సాగు చేయడం వల్ల మంచి లాభాలు వస్తాయన్నారు. నవధాన్యాల సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పైల తవిటి నాయుడు, రమణ, సింహాచలం, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వంగర: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎస్సై వై.వి.జనార్దన్ కోరారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామస్తులతో ఆదివారం సమావేశమయ్యారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. ప్రజలు సోదరభావంతో మెలగాలని, వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవద్దని సూచించారు. గొడవలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



వంగర: శ్రీహరిపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై జనార్దన్

రేగిడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడేవారిపై బండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లింగాలవలస గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, ఎలాంటి గొడవలకు పోవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కళాకారుల మద్దతు వైఎస్సార్‌సీపీకే..



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్‌తో మాట్లాడుతున్న పద్మశ్రీ యడ్ల గోపాలరావు

రాజాం: రాష్ట్ర వ్యాప్తంగా పౌరాణిక రంగస్థల కళాకారుల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉంటుందని ఆ పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాజాం మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్‌లో పద్మశ్రీ యడ్ల గోపాలరావు కుటుంబాన్ని ఆదివారం కలిసి తనకు మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ..తమ కుటుంబం వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తుందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో తనకు వైఎస్సార్ ఎచీవ్‌మెంట్ అవార్డు లభించిందని, రాజాం మున్సిపాలిటీలో ఎంపీ నిధులు నుంచి రూ.10 లక్షలతో కళాకారుల సమాఖ్య భవనానికి మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం తమ కళాకారులకు అండగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కళాకారులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, సడెం శ్రీరామమూర్తి, పాలవలస శ్యామ్ తదితరులు ఉన్నారు.

సామాజిక కవి వేమన

రాజాం సిటీ: సామాజిక కోణంలో తన పద్యాలను సులభమైన రీతిలో రచించిన వేమన సామాజిక కవిగా ఉద్భవించాడని బొంతు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రాజాం రచయితల వేదిక 110వ సమావేశం స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన ఆయన 'వేమన ప్రగతిశీలత' అనే అంశంపై మాట్లాడారు. 17వ శతాబ్దానికి చెందిన వేమన ప్రజాకవిగా ఖ్యాతిగడించారని పేర్కొన్నారు. కులము, మతము అనేవి నాటి సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని భావించి, వాటిని తన పద్యాల ద్వారా చెండాడని అన్నారు. నాటి సమాజ జీవనంలోని లొసుగులను హేళన పూర్వకంగా విమర్శించాడని వివరించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు బొంతును సత్కరించారు. రాజాపు శాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక నిర్వాహకులు గార రంగనాథం, పెంకి దయానిధినాయుడు, ఒమ్మి రమణమూర్తి, నేతేటి గణేశ్వరరావు, వల్లూరు రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బొంతు సూర్యనారాయణను సత్కరిస్తున్న రా.ర.వే సభ్యులు

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- వైఎస్సార్‌సీపీ నాయకులు

బాడంగి: ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ, చాలా గ్రామ పంచాయతీలు కరెంట్ బిల్లులు చెల్లించనందున రక్షిత నీటి పథకాలకు విద్యుత్ సరఫరా నిలిపివేసే అవకాశం ఉందన్నారు. విద్యుత్ శాఖాధికారులు సరఫరా నిలిపివేసే పరిస్థితి తెచ్చుకోకుండా పంచాయతీ అధికారులు 15వ ఆర్థిక సంఘ నిధులతో బిల్లులు చెల్లించాలని సూచించారు. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా.. మండలంలో పది పంచాయతీలు బిల్లులు కట్టడం లేదన్నారు. ప్రస్తుతానికి రక్షిత మంచినీటి పథకాలకు సరఫరా కొనసాగిస్తున్నామని, ఇప్పటికైనా సర్పంచ్‌లు స్పందించి బిల్లులు చెల్లించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

బొబ్బిలి:

ఏసుక్రీస్తును స్తుతించేందుకు ఈస్టర్ పర్వదినం ఎంతో శుభప్రదమైనదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని సీబీఎం చర్చిలో ఆదివారం జరిగిన ఈస్టర్ ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అలాగే మండలంలోని అలజంగి, కారాడ, జీఎస్ఆర్ పురం, రంగరాయపురం ప్రాంతాల్లో ఈస్టర్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈస్టర్ (పునరుత్థాన) పండగను క్రైస్తవులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే రోజున కలువరి సిలువలో మరణించి తిరిగి పునీరుజ్జీవుడైన రోజే ఈస్టర్ అని మత్త పెద్దలు వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పునరుత్థాన పండగను క్రైస్తవ విశ్వాసులు ఘనంగా జరుపుకున్నారు.



బొబ్బిలి: సీబీఎం చర్చిలో ఈస్టర్ సందర్భంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి



తెర్లాం: కూనాయవలసలో సువార్త ప్రకటిస్తున్న క్రీస్తు విశ్వాసకులు

సంక్షిప్తంగా...

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రాజాం: క్రాస్ ప్రోగ్రాం ద్వారా మండలంలో మరమ్మతులకు గురైనా తాగునీటి బోర్లను బాగుచేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వి.జగన్మోహనరావు అన్నారు. ఈ వేసవిలో మండల పరిధిలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీల్లో తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే గ్రామ సచివాలయాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండలంలో పెనుబాక గ్రామంలో పాడైన బోరును ఆదివారం మెకానిక్‌లు మరమ్మతులు చేశారు.

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం, శివ్వాం గ్రామాల్లో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లు ఆదివారం మెకానిక్ సిబ్బంది బాగుచేశారు. సర్పంచ్‌లు కాబోతుల కళావతి, బొక్కేల లక్ష్మీనారాయణమ్మ పనులను పర్యవేక్షించారు.

సేవలే గుర్తింపునిస్తాయి

రాజాం సిటీ: ఉద్యోగ సమయంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. రాజాం ఎంపీడీఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన బాసూరి శంకరరావును ఆదివారం సత్కరించారు. మండల ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు, తెర్లాం, రేగిడి, నరసన్నపేట ఎంపీడీఓలు మధుసూదనరావు, శ్యామల, రామకృష్ణారావు, మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యువత నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. కుటుంబాన్ని పోషించాల్సిన భర్త అకాల మృతితో బాధపడుతున్న ఇందుమతి, జీవనానికి ఇబ్బందులు పడుతున్న వడ్డి రాజు కుటుంబాలకు నెలవారీ సరుకులు అందజేశామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, మీసాల రామకృష్ణ, బి.కృష్ణమూర్తి, జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక

సంతకవిటి: మండలంలోని శేషాద్రిపురం సంతోషి స్కూల్ విద్యార్థులు టి.విద్యాధరి, బి.చరణ్‌తేజ, డి.సాత్విక్‌లు ఆదివారం విడుదలైన జవహర్ నవోదయ 2023–24 పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరచి, ఆరో తరగతిలో ప్రవేశాలు పొందారని కరస్పాండెంట్ తమ్మినేని సింహాచలం తెలిపారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం సీసాలు స్వాధీనం

సంతకవిటి: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కాకరాపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భగవన్నామ స్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం చేకూరుతుందని, ఆధ్యాత్మిక వక్తలు జద్దు జగ్గారావు, రామశేషు తదితరులు అన్నారు. రేగిడి దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరణ చేస్తూ ఉంటే పాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవని అన్నారు. ప్రతీ ఒక్కరు భగవంతున్ని భక్తిశ్రద్ధలతో స్మరణ చేస్తే ముక్తిని పొందుతారన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు, పండిత నాగేశ్వరరావు, భాష్కరరావు, మురళి, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆంగ్లంపై భయం వీడాలి

రాజాం సిటీ: విద్యార్థులు ఆంగ్లంపై భయం వీడితే అర్థం చేసుకోవడం సులభమని ఫోరం ఫర్ ఇంగ్లీష్ ల్యాంగ్వేజ్ (ఎఫ్ఈఎల్‌టీ) అధ్యక్షుడు బీవీ అచ్యుత్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఫెల్ట్ ఆధ్వర్యంలో గతంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో భయం పోగొట్టడంతో పాటు ప్రపంచ స్థాయి విద్యార్థులను తయారుచేసే ప్రయత్నంలో ఫెల్ట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్.సత్యనారాయణ, ఎస్.రవిశంకర్, ఆర్‌పీజేనాయుడు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.